# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్

15-8-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 144

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# రాజగోపాల్‌పై చర్యలు?

పదే పదే సొంతపార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే

- తాజా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పార్టీ
- ఘాటుగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు
- హద్దులు దాటితే చర్యలు తప్పవని హెచ్చరిక
- అధిష్ఠానం దృష్టికీ తీసుకెళతాన్న మహేశ్ గౌడ్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ లో నాయకత్వానికి కొరకరాని కొయ్యగా మారిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం చినికి చినికి గాలివానలా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తితో రగిలిపోతూ రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి

- మిగతా 2వ పేజీలో





## కొండల్ రెడ్డిపై గురి!


- వ్యూహాత్మక విమర్శలు చేస్తున్న కేటీఆర్
- సీఎం రేవంత్ ఫ్యామిలీ పై అవినీతి మరక వేసే ప్రయత్నం
- తిప్పి కొట్టలేకపోతున్న హస్తం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో గులాబీ పార్టీ వ్యూహాత్మక దాడి చేస్తోంది. ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ పై గురి పెట్టింది.

# పాపం ఫిరాయింపు ఎమ్మెల్యేలు!

రెంటికి చెడ్డ రేవడిలా కాంగ్రెస్ లో చేరిన గులాబీ పార్టీ శాసనసభ్యులు

- అధికార పార్టీలో భాగస్వామ్యం లేదు.. అనుకున్న స్థాయిలో నిధులు లేవు
- గౌరవం లేక ఉక్కపోతకు గురవుతున్న వైనం
- ముదిరితే రేవంత్ సర్కార్ కు కష్టమే




రెంటికీ చెడ్డ రేవడిలా మారిపోయింది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన గులాబీ పార్టీ ఎమ్మెల్యేల పరిస్థితి. అధికార పార్టీ అని చేరాక అసలు విషయం తెలుస్తోంది. తత్వం బోధపడుతోంది. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదు. అధికార పార్టీలో గౌరవం ఇవ్వడం లేదు. దీంతో అందరూ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఉక్కపోతకు గురవుతున్నారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన దానం నాగేందర్ నుంచి నిజామాబాద్ కు చెందిన సీనియర్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి వరకు

- మిగతా 3వ పేజీలో



## వికసిత భారత్, ఆపరేషన్ సిందూర్, పేపర్ లీక్ లు.. జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

- రేపు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం
- జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- గడిచిన పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక

3లో

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం: ప్రధాని మోదీ


- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని
- గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రస్తావన
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు సమిష్టి కృషికి పిలుపు

# దారి తప్పుతున్న తెలంగాణ రాజకీయం!

- ఐఏఎస్ అధికారులపై గులాబీ పార్టీ గురి
- ఒకప్పటి కెసిఆర్ సన్నిహితుడు జియేష్ రంజన్ పై విమర్శలు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో విశేష కృషి చేస్తుండడమే కారణం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య గట్టి ఫైట్ నడుస్తోంది. మాటల యుద్ధం కొనసాగుతోంది. అయితే అటు తిరిగి ఇటు తిరిగి ఇప్పుడు ఐఏఎస్ అధికారులకు కూడా సెగ తగులుతోంది. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఆయన కుటుంబాన్ని భారత రాష్ట్ర సమితి టార్గెట్ చేసుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వంలో



మిగతా 3లో

## గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

- సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే...
- ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే
- నాణ్యతలో రాజీ పడొద్దు... ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి
- గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో శ్రీధర్ బాబు ఆదేశాలు



## వేసవి నాటికి 'మెట్రో' అదనపు కోచ్‌లు!

హైదరాబాద్ మెట్రో రైల్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో రద్దీ వేళల్లో మెట్రో రైల్లలో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, ప్రయాణికుల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది.

- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- సన్నాహాలు ప్రారంభం

**క్రైమ్ మిర్రర్ హైదరాబాద్ :** ఐటీ కారిడార్ సహా అన్ని మార్గాల్లో మెట్రో రైళ్లకు ప్రాధాన్యత పెరగడం.. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు రికార్డు స్థాయిలో పెరుగుతుండడంతో.. మెట్రో రైళ్ల సీటింగ్ సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం నడుస్తున్న మూడు కోచ్ ల స్థానంలో..

2లో



# రాజకీయాల్లోకి జగన్ కుమార్తె!

- వైసీపీలో కీలక బాధ్యతలు అప్పగించేందుకు నిర్ణయం
- వచ్చే ఎన్నికల్లో కడప పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి..
- గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసే పనిలో వైసీపీ అధినేత

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీలో మరో వారసురాలు పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారా? వైయస్ జగన్మోహన్ రెడ్డి పెద్ద కుమార్తె హర్షారెడ్డి రాజకీయాల్లోకి వస్తారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అవుతారా? తండ్రికి అండగా నిలిచేందుకు సిద్ధపడుతున్నారా? వచ్చే ఎన్నికల్లో బరిలో దిగేందుకు ఒక నిర్ణయానికి వచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న

## మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

పూలే దంపతుల ఆశయ సాధనలో ప్రజా ప్రభుత్వం

- దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన
- రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు
- ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3లో



## కొడాలి నాని అరెస్ట్!

- అన్ని కేసుల్లో ఆధారాలు సేకరించిన ప్రభుత్వం
- పక్క వ్యూహంతో పట్టు బిగించాలని చూస్తున్న వైనం






# కొండల్ రెడ్డిపై గురి!

ముఖ్యంగా ఆయన సోదరుడు కొండల్ రెడ్డి పై పదే పదే విమర్శలు గురిపెడుతోంది. మహేశ్వరం నియోజక వర్గ పరిధిలోని రావిర్యాలలో టెస్సరాక్ట్ అడ్వాన్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా ఐదు ఎకరాల పారిశ్రామిక భూమిని తక్కువ ధరకు కేటాయించారని కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. మార్కెట్లో దాదాపు 200 కోట్ల రూపాయల విలువైన ఈ భూమిని ప్రభుత్వం కేవలం 7.5 కోట్ల రూపాయలకు అప్పనంగా కట్టబెట్టింది అన్నది కేటీఆర్ ఆరోపణ. ఇదే విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి పేరును బయటకు తీసి అవినీతి మరక అంటించే ప్రయత్నం చేస్తున్నారు గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.



**స్పష్టమైన వైఫల్యం..**

సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ప్రతిపక్షం ఓ స్థాయిలో ఆరోపణలు చేస్తుంటే.. తిప్పి కొట్టడంలో అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యం కనిపిస్తోంది. సాధారణంగా ముఖ్యమంత్రి లేదా ఆ స్థాయి నేతల కుటుంబ సభ్యులు తమపై వచ్చే రాజకీయ ఆరోపణలపై నేరుగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడరు. పార్టీ మంత్రులతో పాటు శ్రేణులు మూకుమ్మడి దాడులు చేయాలి. కానీ కాంగ్రెస్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు పైనే నేరుగా ఆరోపణలు చేస్తున్నా ఆ పార్టీ నేతలకు కనీసం పట్టినట్టు లేదు. సాధారణంగా పారిశ్రామిక భూముల కేటాయింపు అనేది ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. అర్హత కలిగిన సంస్థలకు మాత్రమే భూముల కేటాయింపు ఉంటుంది. పైగా గులాబీ పార్టీ ఆరోపిస్తున్నట్టు ఆ సంస్థలతో కొండల్ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదు. అటువంటప్పుడు ప్రొఫైల్ ఆధారాలపై పక్కా డాక్యుమెంటరీ ఎవిడెన్స్ తో రేవంత్ ప్రభుత్వం మీడియాకు సమగ్ర వివరణ ఇస్తే ఈ ప్రచారానికి బ్రేక్ పడుతుంది. గులాబీ పార్టీ చేసే ప్రయత్నాలను ఎండగట్టినట్లు అవుతుంది.

**కుటుంబ అవినీతి అంశం ప్రాధాన్యం...**

గతంలో కెసిఆర్ ఫ్యామిలీ పై వచ్చిన అవినీతి ఆరోపణలతోనే భారత రాష్ట్ర సమితి ఈ స్థితికి తెచ్చుకుంది. కుటుంబ అవినీతిపై తెలంగాణ సమాజంలో చర్చ జరిగింది. ఇప్పుడు రేవంత్ ఫ్యామిలీ పై అదే మాదిరిగా చర్చ జరగాలన్నది కేటీఆర్ ప్రణాళిక. అందుకే ఈ కంపెనీకి భూముల కేటాయింపును ప్రధానంగా చేసుకొని కేటీఆర్ వరుస ఆరోపణలు చేస్తున్నారు. ఈ కంపెనీ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ... ఈ సంస్థకు అంత సీన్ లేదని.. కేవలం లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభించారని.. కొండల్ రెడ్డి లింకెడ్ ఇన్ ప్రొఫైల్లో ఈ సంస్థకు సంబంధం ఉన్నట్లు ఉందని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై తెలంగాణ ఐటి పరిశ్రమల శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఖండించారు. అధికారిక నిబంధనలకు, పారిశ్రామిక విధానాలకు లోబడే భూమి కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. అయినా సరే వ్యూహాత్మకంగా కేటీఆర్ ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. దానిని ఎదుర్కోవడంలో మాత్రం కాంగ్రెస్ వ్యూహాత్మక తప్పిదం కనిపిస్తోంది.

# దారి తప్పుతున్న తెలంగాణ రాజకీయం!



కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉన్నతాధికారుల పేర్లను కూడా ఆ పార్టీ రాజకీయ వివాదాల్లోకి లాగుతోంది. సాధారణంగా కొందరు వివాదాస్పద అధికారులపై ఆరోపణలు వస్తే రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యత ఉండకపోవచ్చు. కానీ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పేరును భారత రాష్ట్ర సమితి ఈ జాబితాలో చేర్చడం ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్ ను కుదిపేస్తోంది.

**కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడు..**

జయేష్ రంజన్ కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడు అన్న పేరు ఉంది. గులాబీ పార్టీ హయాంలో ఐటి పరిశ్రమ శాఖల మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పుడు.. జెయే ష్ రంజన్ కీలక పాత్ర పోషించారు. కెటిఆర్ విజన్ ను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో, గ్లోబల్ ఇన్వెస్టర్లను హైదరాబాద్కు ఆకర్షించడంలో కేటీఆర్ తో కలిసి పని చేశారు రంజన్. కేటీఆర్ బృందంలో కీలక సభ్యుడిగా పేరు పొందారు. అటువంటి ఐఏఎస్ అధికారిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితి టార్గెట్ చేయడం హాట్ టాపిక్ అవుతోంది. రేవంత్ ప్రభుత్వ నిర్ణయాలతో ముడిపెట్టి ఆరోపణలు చేస్తుండడం ఆసక్తికరంగా మారింది.

**గులాబీ పార్టీ యూటర్న్..**

అయితే ఉన్నట్టుండి రంజన్ పై భారత రాష్ట్ర సమితి శ్రేణులు పడడంపై రకరకాల చర్చ నడుస్తోంది. సివిల్ సర్వీసెస్ అధికారులు రాజ్యాంగానికి, ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వానికి మాత్రమే కట్టుబడి పని చేస్తారు. ప్రభుత్వం మారినంత మాత్రాన ఒక అధికారి పాత పాలకుల పట్ల విశ్వాసాన్ని చూపుతూ.. కొత్త ప్రభుత్వంలో పని చేయకుండా ఉండలేరు. ప్రభుత్వ విధానాలను వేగవంతంగా అమలు చేయడం ఐఏఎస్ అధికారి ప్రాథమిక బాధ్యత. కేటీఆర్ హయాంలో ఐటీ రంగానికి ఊపిరి పోసినట్టే.. రేవంత్ ప్రభుత్వంలోనూ కీలక బాధ్యతలు చూస్తున్నారు రంజన్. దీనిని తట్టుకోలేకపోతున్న గులాబీ పార్టీ రంజన్ ను టార్గెట్ చేసుకుంటుంది.

# రాజగోపాల్‌పై చర్యలు?

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బంది కలిగించేలా ఉంటున్నాయి. గతంలోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ.. అధిష్ఠానం ఆయనపై చర్యలు తీసుకోలేదు. తాజాగా చేసిన వ్యాఖ్యల్ని మాత్రం పార్టీ తీవ్రంగా పరిగణించే అవకాశం ఉందని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి వీలైనప్పుడల్లా తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉంటారు. పార్టీకి సంబంధించిన విషయాలను మీడియా వేదికగా మాట్లాడుతూ తన ఆవేదన ఆందోళన అలా తెలియజేస్తుంటారు. ఓవైపు తాను రాహుల్ గాంధీకి వీర విధేయుడిని, పార్టీకి కట్టుబడి ఉన్నాను అని చెబుతూనే.. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద పరోక్ష విమర్శలు చేస్తూంటారు. తాజాగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీమాంధ్ర నేతల చేతుల్లో పెట్టారని, ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ పెద్దలకు ఆయన కీలక సూచన చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిని కాపాడుకోవాలన్నారు. దీనివల్ల దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న అసలు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలకు పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతోందని కూడా ఎత్తి చూపించారు. పాత శ్రేణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ క్రమంలో అసలైన కాంగ్రెస్ నేతలను అణచి వేసే చర్యలు జరుగుతున్నాయని ఆగ్రహ వ్యక్తం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల ఆధిపత్యం పెరిగి, పాత కాంగ్రెస్ శ్రేణులు నిజమైన కార్యకర్తలు అణచివేతకు గురవుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**పీసీసీ చీఫ్ అరంగేట్రం**

రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం గా మారాయి. చివరికి పార్టీకి చెడ్డపేరు వచ్చే పరిస్థితి కనిపించడంతో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అంతే ఘాటుగా స్పందించారు. రాజ గోపాల్ రెడ్డి తనకు మంచి మిత్రుడని అంటూనే .. అయితే ఎవరికైనా పార్టీయే ఫస్ట్ అని స్పష్టం చేశారు. పార్టీ పరంగా అంతా క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని అన్నారు. అలా కాకుండా పార్టీలో ఎవరైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీలో జరిగే అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడకుండా సంయమనం పాటించాలని నాయకులకు సూచించారు. అంతేకాకుండా రాజగోపాల్ పై అధిష్ఠానానికి ఫిర్యాదు సైతం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకుంటారా అనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి.

# రాజకీయాల్లోకి జగన్ కుమార్తె!

పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అందుకే ఈసారి బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా గెలుపు అందుకోవాలని జగన్ భావిస్తున్నారు. అందులో భాగంగా తన కుమార్తెను బరిలోకి దించేందుకు సిద్ధపడుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**వైఎస్ కుటుంబ హవా..**

కడప జిల్లా అంటే ముందుగా గుర్తొచ్చే పేరు వైయస్ ఫ్యామిలీ. 1978 నుంచి ఆ కుటుంబం పులివెందులతో పాటు కడప జిల్లాలో ప్రభావం చూపుతూ వస్తోంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న కడప జిల్లాలో మాత్రం ఆ కుటుంబ హవా నడిచింది. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం సీన్ మారిపోయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం మూడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. దీనికి కారణం వైయస్ కుటుంబ బలం తగ్గడం. ఆ కుటుంబంలో ఒక్కొక్కరు ఒక్కో మార్గంలో ఉండడంతో ప్రత్యర్థులకు ఆయుధంగా మారింది. గతంలో జగన్మోహన్ రెడ్డికి అండగా చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మ ఉండేవారు. కానీ మొన్నటి ఎన్నికలకు ముందు వారు దూరమయ్యారు. షర్మిల రాజకీయ ప్రత్యర్థిగా మారిపోయారు. ఈ క్రమంలోనే కుటుంబ బలం తగ్గిపోవడంతో రాజకీయంగాను ప్రభావం పడింది.

**పార్టీ ప్లీనరీలో పరిచయం..**

ప్రస్తుతం టిడిపి కూటమి బలంగా ఉంది. సీఎం చంద్రబాబుకు కుటుంబ బలం దండిగా ఉంది. పవన్ కళ్యాణ్ కు సైతం మెగా బ్రదర్స్ అండ ఉంది. ఈ పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడ్డారు. ఆ ఇద్దరు నేతలతో పోల్చుకుంటే జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు కుటుంబ బలం తక్కువ. అందుకే విదేశాల్లో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం చేస్తున్న పెద్ద కుమార్తె హర్షారెడ్డిని జగన్ రంగంలోకి ఇస్తారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో కడప జిల్లా బాధ్యతలను ఆమెకు కట్టబెడతారని సమాచారం. కడప ఎంపీగా ఆమె బరిలోకి దిగుతారని తెలుస్తోంది. వచ్చే ఏడాది పార్టీ ప్లీనరీ జరగనున్న సంగతి తెలిసిందే. అటు తరువాత జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు సిద్ధపడతారు. అంతకుముందే కుమార్తెను పార్టీలోకి తెచ్చి బాధ్యతలు అప్పగిస్తారు. ఇందుకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఒక్క రాజకీయ రంగంగానే కాదు వ్యాపార రంగంలో కూడా కుమార్తెకు అన్ని బాధ్యతలు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నట్లు సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కొడాలి నాని అరెస్ట్!



(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. తదుపరి అరెస్ట్ ఆయనదేనని స్పష్టమవుతోంది. గత కొంతకాలంగా కొడాలి నాని అరెస్టుపై రకరకాలుగా ప్రచారం నడిచింది. అయితే ఇప్పుడు ప్రభుత్వానికి సరైన ఆధారాలు దొరకడంతో ఆయనను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో ఆయన నిర్వర్తించిన సివిల్ సప్లై కు సంబంధించి అవినీతిపై ఆధారాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి చిక్కినట్లు సమాచారం. దీంతో ఏ క్షణం అయినా కొడాలి నాని అరెస్టు ఉంటుందని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. సరైన ఆధారాలతో.. పట్టు బిగించడం ద్వారా.. వల్లభనేని వంశీ మాదిరిగా.. నెలల తరబడి జైల్లో ఉంచే ప్రణాళిక దాదాపు ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది.

**టిడిపి శ్రేణుల ఎదురుచూపు..**

కొడాలి నాని అరెస్ట్ పై తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆశగా ఎదురుచూస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి అరెస్ట్ ఆయనదేనని ప్రచారం నడిచింది. కానీ ఎందుకో కూటమి ప్రభుత్వం కొడాలి నాని విషయంలో మినహాయింపు ఇచ్చింది. అయితే అది మినహాయింపు కాదు అని.. సరైన సమయంలో.. సరైన ఆధారాలతో వల పన్ని పట్టు బిగించాలన్న వ్యూహం అని స్పష్టమవుతోంది. కానీ కొడాలి నాని అరెస్టు జరగకపోవడం పై తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో అసహనం పెరుగుతోంది. దానికి కారణం కొడాలి నాని వ్యవహరించిన తీరు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చంద్రబాబుతో పాటు లోకేష్ పై రెచ్చిపోయారు. ప్రతిరోజు ఏదో ఒక అంశంపై వ్యక్తిగతంగా విరుచుకుపడేవారు. ఆ ఇద్దరు నేతలపై మాత్రమే కాదు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను వ్యతిరేకించిన వారిపై కూడా నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. అందుకే కొడాలి నాని అరెస్టును ఎక్కువ మంది టిడిపి శ్రేణులు కోరుతూ వచ్చాయి.

**వంశీ కంటే ముందే..**

వాస్తవానికి వల్లభనేని వంశీ మోహన్ కంటే ముందే కొడాలి నాని అరెస్టు జరుగుతుందన్న ప్రచారం నడిచింది. కానీ ఇంతలో కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ముంబైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స కూడా చేసుకున్నారు. ఆపరేషన్ అనంతరం కొద్ది నెలల పాటు విశ్రాంతి తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అవుతున్నారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారు. అందుకే కూటమి కొడాలి నాని పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయనపై ఉన్న పాత కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా ప్రభుత్వం సేకరించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి అరెస్టు చేస్తే.. కనీసం బెయిల్ కూడా రాకుండా ఉండే విధంగా చట్టపరంగా పట్టు బిగించాలన్నది ప్రభుత్వ వ్యూహంగా తెలుస్తోంది. వల్లభనేని వంశీ మాదిరిగా నెలల తరబడి జైల్లో రిమాండ్ ఖైదీగా ముంచే ప్రణాళిక సిద్ధమైనట్లు సమాచారం.

**చాలా రకాల ఫిర్యాదులు..**

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొడాలి నాని పై విపరీతంగా ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు పది వరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా వైసిపి హయాంలో పౌరసరఫరాలకు సంబంధించిన మంత్రిగా ఉండేవారు కొడాలి నాని. నాడు పేర్ని నానికి సంబంధించిన గోదాముల్లో బియ్యం పక్కదారి పట్టడం పై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో కొడాలి నాని హస్తము ఉన్నట్లు కూడా ఆధారాలు సేకరించిందట ప్రభుత్వం. మరోవైపు గుడివాడలో కొడాలి నాని అనుచరుల చేతుల్లో కబ్జాకు గురైన ఆస్తులన్నీ వెనక్కి ఇప్పించారు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. స్థానికంగా కూడా కొన్ని రకాల కేసులు నమోదయ్యాయి కొడాలి నాని. అయితే వీటన్నింటిపై గత కొంతకాలంగా ఆధారాలు సేకరించారు పోలీసులు. వాటిని అడ్డం పెట్టుకొని కొడాలి నాని అరెస్ట్ కు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం: ప్రధాని మోదీ

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు



సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.




# గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు



(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** 'గోదావరి పుష్కరాలు–2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ పక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు 2027' కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశర చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్–1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు. బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. త ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లు తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లుగా.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## వికసిత భారత్, ఆపరేషన్ సిందూర్, పేపర్ లీక్ లు.. జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు**

ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దేశం ముందంజ**

గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు. యువశక్తికి, మహిళా సాధికారతకు పెద్దపీట

# పాపం ఫిరాయింపు ఎమ్మెల్యేలు!




అందరి పరిస్థితి అదే. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం, రాజకీయ మనుగడ కోసం.. ఇలా రకరకాల కారణాలతో అధికార పార్టీకి దగ్గరయ్యారు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు. చేరాక వారికి సరైన గౌరవం దక్కడం లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల అపాయింట్మెంట్లు కూడా లభించడం లేదు. దీంతో వీరంతా ఎందుకు చేరామా? అని లోలోపల బాధపడుతున్నారు.

**అన్నీ ఇబ్బందులే..**

గులాబీ పార్టీకి దూరమైన ఈ ఎమ్మెల్యేలు అధికార పార్టీ ముద్ర చూపలేకపోతున్నారు. అధికార పార్టీలో భాగం కాలేకపోతున్నారు. సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసుకోలేకపోవడమే అందుకు కారణం. ఒకవైపు న్యాయస్థానాల్లో నడుస్తున్న పార్టీ మార్పిడి పిటిషన్లతో అధికారికంగా కాంగ్రెస్లో వీరంతా చేరలేకపోతున్నారు. కేవలం సీఎంను నిధుల కోసమే కలిసాం అని సాంకేతిక సంజాయిషీలు న్యాయస్థానాలకు ఇస్తున్నారు. మరోవైపు వీరు ఆశిస్తున్నట్టు నిధులు రావడం లేదు. పెండింగ్ నిధులు చెల్లించడం లేదు. దీంతో వీరిని నమ్ముకున్న అనుచరులు అటు గులాబీ పార్టీకి.. ఇటు కాంగ్రెస్ పార్టీ మధ్య నలిగిపోతున్నారు. అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే గుర్తింపు రాక.. అటు భారత రాష్ట్ర సమితి పై హక్కు లేక ఫిరాయింపు ఎమ్మెల్యేలంతా రాజకీయంగా రెంటికి చెడ్డ రేవడిలా మారిపోయారు.

**వ్యూహాత్మక లోపం..**

గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు చేరారు సరే. వారికి గౌరవం ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక లోపం కనిపిస్తోంది. ఒకవేళ అలా చేరిన ఎమ్మెల్యేలకు గౌరవం ఇస్తుంటే నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ నేతలు తీవ్రహాసం తృప్తికి గురవుతున్నారు. ఖైరతాబాద్ లో దానం నాగేందర్ స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో రోజు ప్రోటోకాల్ యుద్ధాలు చేయాల్సి వస్తోంది. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ పాత శ్రేణుల నుంచి సహకారం లభించడం లేదు. ఇలా చెప్పుకుంటే ప్రతి చోటా ఇబ్బందికరమే. సొంత పార్టీ మూల శ్రేణులను నొప్పించకుండా.. వలస ఎమ్మెల్యేలను రక్షణ కల్పించడంలో సరైన వ్యూహం అధికార పార్టీ వద్ద లేదు. దీంతో హస్తం పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తమ నిర్ణయం తొందరపాటుగా భావిస్తున్నారు. ఒకవేళ మాతృ పార్టీ నుంచి సరైన పిలుపు వచ్చి.. భవిష్యత్తులో అవకాశాలు ఇస్తామంటే వారంతా యూటర్న్ తీసుకునే అవకాశం ఉంది. అదే జరిగితే కాంగ్రెస్ పార్టీకి భారీ మూల్యం తప్పదు.

**ఓపెన్ స్టేట్మెంట్లు..**

గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్లో ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. మేము కెసిఆర్ గారిని మోసం చేయదలుచుకోలేదు.. కేవలం నిధుల కోసమే వచ్చాం కానీ ఇక్కడ పరిస్థితి బాగాలేదు అంటూ పోచారం లాంటి నేతలు బాధపడుతున్నారు. గులాబీ పార్టీ నుంచి ఇలా బయటకు వచ్చి అలా మళ్లీ మాతృ పార్టీలోకి వెళ్లిపోయారు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి. అయితే గులాబీ పార్టీ ఎమ్మెల్యేలను ఆకర్షించడంలో కాంగ్రెస్ వ్యూహాత్మకతప్పిదం స్పష్టంగా కనిపిస్తోంది. చేర్చుకున్న వారికి గౌరవం లభించడం లేదు. కొత్తగా చేరే వారు లేకుండా పోతున్నారు. ఈ అసంతృప్తి ఫిరాయింపు ఎమ్మెల్యేలు పెరిగితే అది అంతిమంగా కాంగ్రెస్ పార్టీకే నష్టం..

# వేసవి నాటికి 'మెట్రో' అదనపు కోచ్‌లు!

అదనపు కోచ్ లను జోడించడం లేదా అదనపు రైళ్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రద్దీని నియంత్రించాలని భావిస్తోంది తెలంగాణ సర్కార్.

**సమయం పట్టే అవకాశం...**

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం అయితే తీసుకుంది కానీ.. ఇది క్షేత్రస్థాయిలో సాధ్యమేనా అనే టాక్ వినిపిస్తోంది. మెట్రో రైల్ అధికార వర్గాల ప్రకారం.. ఈ నూతన కోచ్ ల కొరుగోలు, తయారీ ప్రక్రియకు కాస్త సమయం పట్టనుంది. మెట్రో కోచ్ లు సాధారణ రైలు డబ్బాల మాదిరిగా రెడీమేడ్ గా లభించవు. హైదరాబాద్ మెట్రో ట్రాక్ సిస్టమ్స్, డిజైన్, సిగ్నలింగ్ సాంకేతికతను అనుగుణంగా ప్రత్యేకంగా తయారు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్డర్ ఇచ్చి తయారీ పూర్తయి ఇక్కడికి చేరుకోవడానికి దాదాపు 6 నుంచి ఎనిమిది నెలల సమయం పట్టి అవకాశం ఉంది. అంటే వచ్చే వేసవి నాటికి సిద్ధమవుతాయి అన్నమాట. అది కూడా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభిస్తేనే.

**ఆ మార్గాల్లో రద్దీ..**

జంట నగరాల్లో మెట్రో రైల్లో విపరీతమైన రద్దీ పెరుగుతోంది.



ప్రధానంగా మియాపూర్– ఎల్బీనగర్.. నాగోల్– రాయదుర్గం కారిడార్లలో ఉదయం తో పాటు సాయంత్రం వేళల్లో తీవ్ర రద్దీ నెలకొంటోంది. వేలాది మంది ఐటి ఉద్యోగులు, రోజువారి ప్రయాణికులు కోచ్ లలో స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా రాబోయే కోచ్ లలో ప్రయాణ సామర్థ్యం గణనీయంగా పెరగడమే కాకుండా.. రైళ్ల ఫ్రీక్వెన్సీ ని మరింత తగ్గించడానికి వీలవుతుందని మెట్రో అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**తయారీ సంస్థతో చర్చలు..**

రాష్ట్ర ప్రభుత్వపరంగా ఈ అదనపు కోచ్ల ఏర్పాటుకు సంబంధించి కార్యాచరణ ప్రారంభం అయింది. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల కేటాయింపు, తయారీ సంస్థలతో చర్చలు తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. కోచ్ల సంఖ్య పెరిగితే ప్రయాణం మరింత వేగవంతం కావడమే కాకుండా సౌకర్యవంతంగా మారుతుందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. వచ్చే ఆరు నుంచి 8 నెలల కాలంలో కొత్త కోచ్ లు పట్టాలెక్కే అవకాశం ఉన్నట్లు కూడా అధికార వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.



రాత్రి నిండా కమ్ముకున్న చీకటిని చీల్చుకుంటూ, తూరుపు దిక్కున ఒక సన్నని ఎరుపు రేఖ మొలకెత్తుతుంది. అది వెలుగు కాదు, వెలుగు రాబోతోందన్న వాగ్దానం. ఆ క్షణాన ఆకాశం ఏ భాషలోనూ మాట్లాడదు, కానీ లోకమంతా దాన్ని అర్థం చేసుకుంటుంది చీకటి శాశ్వతం కాదు అని. తొలి సంజకు తూరుపు ఎరుపెక్కడం అనేది కేవలం ఒక ప్రకృతి దృశ్యం కాదు, అది మానవ జీవితానికి ప్రకృతి ఇచ్చే మొట్టమొదటి పాఠం.

# చీకటి శాశ్వతం కాదు

మనిషి పుట్టుక కూడా అలాంటిదే. ఏ బిడ్డ పుట్టినా, ఆ ఇంట్లో ఒక తొలి సంజ ఉదయిస్తుంది. గతంలో ఎంత కష్టాలున్నా, ఎన్ని కన్నీళ్లున్నా, కొత్త ప్రాణం పుట్టిన క్షణంలో అంతా మర్చిపోయి, భవిష్యత్తు వైపు చూసే ఆశ మొలకెత్తుతుంది. అదే ఎరుపు రంగు నొప్పి నుంచి పుట్టిన ఆనందపు రంగు. ప్రసవ వేదన తర్వాత తల్లి కళ్ళలో మెరిసే ఆ కాంతి, తూరుపున కనిపించే ఎరుపు రంగుకు వేరుకాదు.

కానీ ఈ ఎరుపు రంగుకు మరో కోణం కూడా ఉంది. అది సూర్యాస్తమయంలో కూడా కనిపిస్తుంది. పొద్దు పొడిచేటప్పుడూ ఎరుపే, పొద్దు గుంకేటప్పుడూ ఎరుపే. పుట్టుకకూ, చావుకూ ప్రకృతి ఒకే రంగును ఇచ్చింది. ఇది యాదృచ్ఛికం కాదు. జీవితం, మరణం అనేవి వేరువేరు సంఘటనలు కావని, అవి ఒకే చక్రంలో భాగాలని ప్రకృతి మౌనంగా బోధిస్తుంది.ఉదయపు ఎరుపు నూతన ఆశలు, కొత్త ప్రారంభాలకు సంకేతం.సాయంత్రపు ఎరుపు అనుభవం, పరిపక్వత మరియు ప్రశాంతతకు సంకేతం.తెలుగు నేల మీద సంజ అనే మాటకు ఒక ప్రత్యేకమైన మార్దవం ఉంది. తెలుగింటి ఆడబిడ్డ సంధ్యవేళ దీపం వెలిగించి తులసి కోట ముందు నిలబడే దృశ్యం, తరతరాలుగా మన సంస్కృతిలో పాతుకుపోయింది. అది కేవలం ఆచారం కాదు, అది కాలానికి ఇచ్చే గౌరవం. ఉదయాన్నే లేచి తూరుపు వైపు నమస్కరించడంలో ఒక తత్వం దాగి ఉంది నిన్నటి రోజు ఎలా గడిచినా, ఈ రోజు కొత్తది అన్న నమ్మకం. ఈ నమ్మకమే మనిషిని ప్రతిరోజూ కొత్తగా బతకనిస్తుంది.జీవితంలో మనం ఎన్నో చీకటి రాత్రులు దాటుతాం. కష్టాలు, వైఫల్యాలు, నష్టాలు, ఒంటరితనం ఇవన్నీ రాత్రి రూపాలే. కానీ రాత్రి ఎంత దీర్ఘంగా ఉన్నా, అది శాశ్వతం కాదని తూరుపు ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటుంది. ఎంత గాఢాంధకారమైనా, తూరుపు దిక్కున ఆ ఎర్రటి రేఖ మొలకెత్తక మానదు. ఇదే ప్రకృతి ఇచ్చే అతిపెద్ద భరోసా. మనిషి జీవితంలో నిరాశ కమ్మేసిన క్షణాల్లో, ఆకాశం వైపు చూస్తే చాలు – రేపటి ఉదయం ఖాయమని అది గుర్తు చేస్తుంది.ఎంత చీకటి కమ్మినా, వెలుగు రాక తప్పదు,ఎంత దుఃఖం చుట్టుముట్టినా, ఆనందం మొలకెత్తక మానదు.తత్వశాస్త్రపరంగా చూస్తే, తొలి సంజ అనేది పరివర్తన కు ప్రతీక. చీకటి నుంచి వెలుగుకు మారే ఆ కొద్ది క్షణాలు, రెండు లోకాల మధ్య వారధిలా ఉంటాయి. మనిషి జీవితంలో కూడా ప్రతి కొత్త ప్రారంభం ఇలాంటి సంధి క్షణమే. పాత అలవాట్లను వదిలి కొత్త మార్గంలో అడుగుపెట్టే ప్రతి నిర్ణయం, ఒక తొలి సంజే. ఆ నిర్ణయం తీసుకునేటప్పుడు మనసులో భయం, సందేహం సహజం చీకటి ఇంకా పూర్తిగా వీడనప్పుడు కలిగే అనుభూతిలా. కానీ ధైర్యంగా ముందడుగు వేస్తే, ఎరుపు రంగు క్రమంగా బంగారు వెలుగుగా మారుతుంది.ఈ తత్వాన్ని అర్థం చేసుకున్న వారు జీవితాన్ని భయంతో కాక, ఆశతో ఎదుర్కొంటారు. ప్రతి పరాజయాన్ని ఒక రాత్రిగా, ప్రతి కొత్త ప్రయత్నాన్ని ఒక తొలి సంజగా చూస్తారు. అలాంటి దృక్పథం ఉన్నవారికి జీవితం ఎప్పటికీ ముగిసిపోదు, అది నిరంతరం పునరుజ్జీవనం చెందుతూనే ఉంటుంది.ఈ సత్యాన్ని హృదయంలో నిలుపుకున్న మనిషి, జీవితంలో ఎలాంటి రాత్రినైనా ధైర్యంగా దాటగలడు, ఎందుకంటే అతనికి తెలుసు తూరుపు ఎప్పుడూ మౌనంగా వేచి ఉంటుందని, ఎర్రటి వెలుగుతో కొత్త ఆశను మోసుకొస్తుందని. తొలి సంజకు తూరుపు ఎరుపు అది ప్రకృతి రాసిన మొట్టమొదటి కవిత్వం, జీవితం నేర్పే మొదటి పాఠం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# నీళ్ల సీసాలో నిండు ప్రాణాలు.. యాసిడ్ ఇచ్చిన వైద్య సిబ్బంది..

## మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రతపై తీవ్ర ప్రశ్నలు

## మందులివ్వాల్సిన చోట ముప్పు ముంచుకొచ్చిందా?

## తాగునీటికి బదులు ప్రమాదకర ద్రావణం ఎలా చేరింది?

## వృద్ధుడి ప్రాణాలతో చెలగాటానికి బాధ్యులెవరు?




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):**

ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిలోనే, ఓ వృద్ధుడి ప్రాణాలు ప్రమాదంలో పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన, 60 ఏళ్ల కురిమెళ్ల చంద్రయ్యకు మందులు వేసుకునేందుకు నీళ్లు కావడంతో, సిబ్బంది అందించిన సీసాలో నీటికి బదులు యాసిడ్ ఉండటంతో, అది తెలియక తాగిన చంద్రయ్య తీవ్ర అస్వస్థతకు గురైనట్లు వెలుగులోకి వచ్చింది.!? ప్రస్తుతం ఆయన ప్రాణాలతో పోరాడుతున్నట్లు సమాచారం. మర్రిగూడ మండల కేంద్రంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో, ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన చంద్రయ్యకు వైద్యులు చికిత్స అందించి కొన్ని టాబ్లెట్లు ఇచ్చారు. మందులు వేసుకునేందుకు నీళ్లు కావాలని ఆయన సిబ్బందిని అడిగారు. ఈ సమయంలో సిబ్బంది అందించిన సీసాను నీళ్ల సీసాగా భావించిన చంద్రయ్య, అందులో ఉన్న ద్రావణాన్ని తాగినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ద్రావణం నోటిలో పడిన వెంటనే మంటతో బాధితుడు కేకలు వేయడంతో అసలు విషయం బయటపడింది.!? అప్పటికే ప్రమాదకర ద్రావణం తాగిన చంద్రయ్య పరిస్థితి, ఆందోళనకరంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు.

### నీళ్లు అడిగితే యాసిడ్ ఎలా వచ్చింది?

ఈ ఘటనలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఇదే. ఆస్పత్రిలో ఉపయోగించే యాసిడ్, ఇతర రసాయనాలను సాధారణ మందులు, తాగునీరు, రోగులు ఉపయోగించే వస్తువుల దగ్గర ఉంచకూడదన్న కనీస భద్రతా ప్రమాణాలు ఉంటాయి కానీ అవేమి పాటింపు లేదని తెలుస్తుంది. ప్రమాదకర పదార్థాలను స్పష్టమైన గుర్తులతో, ప్రత్యేక ప్రదేశాల్లో, బాధ్యత కలిగిన సిబ్బంది పర్యవేక్షణలో భద్రపరచాల్సి ఉంటుంది. అలాంటి పదార్థం సాధారణ సీసాలో ఉండి, రోగికి నీళ్లుగా అందే పరిస్థితి ఎలా ఏర్పడిందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### ఈ ఘటనపై బాధ్యత ఎవరిది..

చంద్రయ్యకు యాసిడ్ అందించిన వ్యక్తి ఎవరు? ఆ సీసా ఎక్కడి నుంచి వచ్చింది? అది నీళ్ల సీసాల మధ్యకు ఎలా చేరింది? ఆస్పత్రిలో ప్రమాదకర రసాయనాల నిల్వకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయా? సిబ్బందికి వాటి గురించి శిక్షణ ఇచ్చారా? విధుల్లో ఉన్న సిబ్బంది రోగికి ఏ పదార్థం అందిస్తున్నారో పరిశీలించారా? ఘటన తర్వాత ఆస్పత్రి యాజమాన్యం తీసుకున్న చర్యలేమిటి? ఇవన్నీ కేవలం ప్రశ్నలు మాత్రమే కాదు.. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశాలు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అసలు నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో గుర్తించాల్సిన అవసరం ఉంది. బాధ్యత నిర్ధారణ జరిగితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రిలోని భద్రతా వ్యవస్థను పూర్తిగా సమీక్షించాలి. ఒక రోగి ఆస్పత్రికి వెళ్లేది ప్రాణాలను కాపాడించుకోవడానికి. అక్కడే ప్రమాదకర పదార్థం తాగాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది వ్యక్తిగత పొరపాటుగా ముగిసిపోకూడదు. వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దే అవకాశంగా అధికారులు చూడాలి. ఈ అంశంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది..

ఇది కేవలం ఒక సిబ్బంది పొరపాటుగా చూడాల్సిన వ్యవహారమా? లేక ఆస్పత్రి నిర్వహణలో ఉన్న భద్రతా లోపాలకు ఇది నిదర్శనమా? అన్నదానిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

### ఒక్క పొరపాటు.. కుటుంబానికి జీవితాంతం వేదన కావచ్చు.

వైద్య రంగంలో చిన్న నిర్లక్ష్యానికి కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. సాధారణంగా కనిపించే ఓ సీసా లోపల ఉన్న పదార్థం ఏమిటో నిర్ధారించకుండా, రోగికి అందించడం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. చంద్రయ్యకు ప్రాణాపాయం తప్పినా, ఇలాంటి ఘటన మరోసారి జరగకుండా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సంబంధిత ఆసుపత్రి నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవలసి ఉన్నది. ఆస్పత్రిలో పనిచేసే ప్రతి సిబ్బందికి ప్రమాదకర రసాయనాల నిర్వహణ, వాటి నిల్వ, గుర్తింపు, రోగులకు మందులు అందించే విధానం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి. కానీ అవేమి లేవని తెలుస్తుంది.ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం మరింత ఎక్కువ కానీ, మర్రిగూడలో దీనికి విరుద్ధమనే చెప్పుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరక్షరాస్యులు, వృద్ధులు, సహాయకులు లేని రోగులు అక్కడి సిబ్బందిపై పూర్తిగా ఆధారపడుతుంటారు. వారు సీసాలో ఉన్న పదార్థాన్ని గుర్తించే పరిస్థితిలో ఉండకపోవచ్చు. అందుకే రోగికి ఇచ్చే ప్రతి మందు, నీరు, ద్రావణం విషయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి. పేరు లేని సీసాలు, గుర్తులు లేని బాటిళ్లు, ప్రమాదకర రసాయనాలను సాధారణ ప్రదేశాల్లో ఉంచడం వంటి అంశాలపై అధికారులు దృష్టి పెట్టాలి.

**డ్యూటీకి డుమ్మాలు కొట్టే అధికారులు.. మ్యానేజ్ చేసే మేనేజర్.. మరో క్రైమ్ మిర్రర్ కథనం ద్వారా మీ ముందుకు..**

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది..**

# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !

**స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు.**

**1947 ఆగస్టు 14 ఉదయం.**

ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు.

# పటాన్‌చెరులో ఘనంగా గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలు

## 250 మందికి పైగా యువకుల రక్తదానం.. ఉచిత వైద్య శిబిరం, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 14: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతి వేడుకలను జిఎంఆర్ యువసేన, జివిఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, అభిమానులు, సన్నిహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరంలో 250 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. అలాగే



బ్లాక్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. అనంతరం అభిమానులు, సన్నిహితులు, యువసేన సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న సమయంలో అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న ఆసక్తి, స్నేహశీలత, సేవా భావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మధురానగర్‌లో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్,ఆగస్ట్ 14:ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోతో కలిసి నాగోల్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న వరదనీరు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. మధురానగర్‌కు ఆనుకుని ఉన్న ఇంద్రప్రస్థ కాలనీ, ధనలక్ష్మి నగర్ తదితర కాలనీల నుంచి వచ్చే వరదనీరు, డ్రైనేజీ నీరు మధురానగర్ వద్ద నిలిచిపోతున్నట్లు తెలిపారు. దీంతో స్వల్ప వర్షానికే కాలనీలో మోకాళ్ల లోతు వరకు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో మధురానగర్ అపార్ట్‌మెంట్ల సమీపంలో వరదనీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన చిన్న ఔట్‌లెట్ ప్రస్తుతం సరిపోవడం లేదని తెలిపారు. దాని స్థానంలో పెద్ద ఔట్‌లెట్ నిర్మిస్తే రానున్న రోజుల్లో వరదనీరు సాఫీగా వెళ్లి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన జోనల్ కమిషనర్ వికాస్ మహతో పెద్ద ఔట్‌లెట్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## మాదాపూర్ డివిజన్ ఎంఆర్పీఎస్ అధ్యక్షుడిగా ఎలిమెల ప్రశాంత్ నియామకం...

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్పీఎస్ నుండి శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడి గా ఎలిమెల ప్రశాంత్ ను నియమిస్తూ ఎంఆర్పీఎస్ జాతీయ నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎలిమెల ప్రశాంత్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న , రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి యాదయ్య లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా మాదాపూర్ డివిజన్‌లో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తానని, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నియామకంపై సంతోషం వ్యక్తం చేసిన ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షులు పాపన్న, రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి బాచుపల్లి యాదయ్య లు ప్రశాంత్ కు శుభాకాంక్షలు తెలిపారు. యువతను కలుపుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పీ ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చండూరు చౌరస్తాలో బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



చండూరు, క్రైమ్ మిర్రర్: పట్టణంలోని నీళ్ల ట్యాంకు సెంటర్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించే అత్యాధునిక బస్ షెల్టర్ కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం సాయంత్రం భూమి పూజ చేశారు. అనంతరం నిర్మాణ పనుల గురించి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనూ మోడల్ బస్ షెల్టర్ నిర్మాణాన్ని ఇక్కడ చేపడుతున్నారు. ఏళ్ల నాటి నుంచి చండూరు చౌరస్తాలో బస్ షెల్టర్ లేక రోడ్లపైనే ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఎట్టకేలకు ఇక్కడ బస్ షెల్టర్ నిర్మాణం జరుగుతుండడం పట్ల స్థానికుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. బస్సు షెల్టర్ లో ప్రయాణికులకు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, మంచి నీటి సదుపాయం సమకూర్చనున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కమిషనర్ ఎల్. మల్లేశం కౌన్సిలర్లు కటకం రమేష్,కలిమికొండ పారిజాత జనార్ధన్, వాసు,కోడి సుష్మ వెంకన్న, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పున్న ధర్మేందర్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఐతరాజు మల్లేష్, మండల అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్లు ఖలీల్, మాధగోని వెంకన్న, చేనేత సహకార సంఘం డైరెక్టర్ ఏలె శ్రీను,కాంగ్రెస్ మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు కారింగు పల్లవి, మండల అధ్యక్షురాలు రాధా రెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి, ఇరిగి వెంకటేశ్వర్లు, కావలి ఆంజనేయులు కన్నబోయిన నాగరాజు, బెల్లంకొండ శేకర్, పున్న సైదులు, బీమనపల్లి శేఖర్, పందుల సత్యం, గుర్రం రాము తదితరులు పాల్గొన్నారు.

## చందేపల్లిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం

### ప్రజల వద్దకు కాంగ్రెస్ శ్రేణుల మార్నింగ్ వాక్




**ఆత్మకూరు(ఎం),ఆగస్టు14/క్రైమ్ మిర్రర్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటి అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ శ్రేణులు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మోటకొండూర్ మండలంలోని చందేపల్లి గ్రామంలో మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నాయకులు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, జీరో కరెంట్ బిల్లు తదితర పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేరుగా విని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోట్ల నగేశ్, పిఏసిఎస్ డైరెక్టర్ బొల్లేపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుదగాని జయరాములు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బోట్ల సంజీవ, కుర్మ సంఘం అధ్యక్షుడు కందరపు కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 16న శ్రీ బద్రీనాథ్ పెరుమాళ్ తిరునక్షత్రం



గండిపేట(క్రైమ్ మిర్రర్): పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ బద్రీనాథ్ పెరుమాళ్ తిరునక్షత్ర మహోత్సవాన్ని ఆగస్టు 16న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జీవా, శ్రీరామనగరం, ముచ్చింతల్‌తో పాటు స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ వేదికగా ప్రత్యేక దివ్యోత్సవాలను నిర్వహించనున్నారు. ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పవిత్ర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ బద్రీనారాయణ పెరుమాళ్‌ను కరుణామూర్తిగా ఆరాధిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు. ఈ పుణ్యదినాన స్వామివారిని దర్శించి ఆరాధించడం ద్వారా భక్తులకు శాంతి, జ్ఞానం, రక్షణ లభించడంతో పాటు ఆధ్యాత్మిక చింతన, భక్తి మరింత పెరుగుతాయని భక్తుల విశ్వాసం. ధర్మమార్గంలో పయనిస్తూ భగవత్ సేవకు అంకితం కావడానికి ఈ ఉత్సవం ప్రేరణనిస్తుందని నిర్వాహకులు తెలిపారు. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ వద్ద నిర్వహించనున్న దివ్యోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిరుమంజన సేవ, అర్చన సేవల్లో పాల్గొని స్వామివారి కృపను పొందడంతో పాటు తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక పురోగతి కోసం ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


## ఆత్మగౌరవం కోసం కొట్లాడి ప్రత్యేక తెలంగాణను తెచ్చుకున్నాము

### తెలంగాణ ఇచ్చింది తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే
### తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్తోనే సాధ్యం
### రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా
### కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 14(క్రైమ్ మిర్రర్):** చౌటుప్పల్ లోని సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా...నేనెక్కడా కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించలేదు,విమర్శించను కూడా.. బయట నుండి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే చెప్పా... నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయం గుర్తు చేశా.... కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి..... సీమాంధ్ర పాలకులు,సీమాంధ్ర మీడియా చెప్పు చేతల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ,ప్రభుత్వం నడపవద్దని కోరుతున్నా.... ఆత్మగౌరవం కోసం కొట్లాడి ప్రత్యేక తెలంగాణను తెచ్చుకున్నాము... ప్రజా పాలన అంటే పేదల కోసం పని చేయాలి.. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదు.... తెలంగాణ ఇచ్చింది,తెచ్చింది కాంగ్రెస్ పార్టీ... తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్ తోనే సాధ్యం

# రేషన్ బియ్యం అక్రమ దందాపై ఉక్కుపాదం

## గోదాంలో భారీగా రేషన్ బియ్యం నిల్వ



**సైదాబాద్(క్రైమ్ మిర్రర్):** పేదలకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న, రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారన్న సమాచారంతో, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. సైదాబాద్ రెడ్డి కాలనీలోని వాటర్ ప్లాంట్ సమీపంలోని, ఓ గోదాంలో అక్రమంగా నిల్వ చేసినట్లు అనుమానిస్తున్న సుమారు 98 బియ్యం బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున నిర్వహించిన ఈ దాడితో అక్రమ, రేషన్ బియ్యం వ్యాపారానికి పాల్పడుతున్న వారిలో కలకలం రేగింది. సివిల్ సప్లైస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సి. శశిధర్‌రాజు ఆదేశాల మేరకు, ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. శ్రీశైలం, ప్రభాకర్ తదితరులు శుక్రవారం తెల్లవారుజామున, సుమారు మూడు గంటల సమయంలో రెడ్డి కాలనీలో దాడి నిర్వహించారు. ముందస్తు సమాచారంతో గోదాంను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో బియ్యం బస్తాలు నిల్వ చేసి ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు.

**పేదల బియ్యంతో అక్రమ వ్యాపారం**

ప్రభుత్వం పేద, నిరుపేద కుటుంబాలకు తక్కువ ధరకు ఉచితంగా అందిస్తున్న, రేషన్ బియ్యం వారి జీవన ఆహార భద్రతకు కీలక ఆధారం. అయితే ప్రజలకు చేరాల్సిన బియ్యాన్ని, కొందరు అక్రమంగా సేకరించి వ్యాపార అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మధ్యవర్తులు, అక్రమ కొనుగోలుదారులు, నిల్వదారులు కలిసి పనిచేస్తున్నారన్న అనుమానాల నేపథ్యంలో, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం రెడ్డి కాలనీ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా రేషన్ బియ్యం కొనుగోలు, నిల్వ, తరలింపు వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పూసల బస్తీ-- సైదాబాద్ ప్రాంతానికి చెందిన హరీష్‌రెడ్డి అనే వ్యక్తి, రేషన్ బియ్యాన్ని సేకరించి రెడ్డి కాలనీలోని వాటర్ ప్లాంట్ పక్కన ఉన్న గోదాంలో నిల్వ చేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. అక్కడి నుంచి బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. దాడి సందర్భంగా గోదాంలో ఉన్న సుమారు 98 బియ్యం బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి విచారణ నిమిత్తం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? ఎవరి నుంచి కొనుగోలు చేశారు? ఎంతకాలంగా ఈ వ్యవహారం కొనసాగుతోంది? ఇప్పటికే ఎంత మొత్తంలో బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు? ఈ అక్రమ దందా వెనుక మరెవరైనా ఉన్నారా? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న సరఫరా గొలుసును గుర్తించడమే లక్ష్యంగా, అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. కేవలం గోదాంలో బియ్యం పట్టుబడటంతో వ్యవహారం ముగిసిపోకుండా, బియ్యం మూలం నుంచి చివరి గమ్యస్థానం వరకు దర్యాప్తు చేస్తే, అక్రమ దందాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**అక్రమ దందాదారులకు హెచ్చరిక**

పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం, ఇతర మార్గాల్లో విక్రయించడం చట్టవిరుద్ధమని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ దందాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించే వారికి చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు అందాల్సిన ఆహార ధాన్యాలు, పక్కదారి పట్టకుండా నిరంతరం తనిఖీలు, నిఘా కొనసాగిస్తామని వెల్లడించారు. రెడ్డి కాలనీలో జరిగిన ఈ దాడి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భారీగా బియ్యం పట్టుబడటంతో ఈ వ్యవహారం వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై, దర్యాప్తు కొనసాగితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## రాగం సుజాత యాదవ్‌కు ఘన నివాళులు

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 14:** రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు మాజీ చైర్‌పర్సన్ శ్రీమతి రాగం సుజాత యాదవ్ మృతి చెందడంతో ఆమె పార్థివదేహాన్ని తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాగం సుజాత యాదవ్ మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## వాల్టా చట్టం ప్రకారమే బోర్లు వేయాలి

### తహశీల్దార్ విజయ్ కుమార్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం లోని రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణకు వాల్టా చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని చిట్యాల మండల తహశీల్దార్ విజయ్ కుమార్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని బోరుబండ్ల యజమానులతో తహశీల్దార్ విజయ్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బోరుబండి యజమాని భూగర్భ జలాల శాఖకు రూ.1,000 చలానా చెల్లించి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న బోరుబండ్లకు మాత్రమే బోర్లు వేసే అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. రైతుల భూముల్లో బోర్లు వేసే ముందు సంబంధిత రైతు వాల్టా చట్టం ప్రకారం ముందస్తు అనుమతులు పొందాడో లేదో బోరుబండి యజమానులు పరిశీలించాలని సూచించారు. అనుమతులు పొందిన భూముల్లో మాత్రమే బోర్లు వేయాలని, నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేస్తే సంబంధిత బోరుబండ్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిట్యాల మండల రైతులు కూడా బోర్లు వేయించుకునే ముందు సంబంధిత అధికారుల నుంచి వాల్టా చట్టం ప్రకారం అవసరమైన అన్ని అనుమతులు తప్పనిసరిగా పొందాలని తహశీల్దార్ సూచించారు. ఈ సమావేశంలో బోరుబండ్ల యజమానుల సంఘం మండల అధ్యక్షుడు ఇమ్మాడి వెంకన్నతో పాటు పలువురు బోరుబండ్ల యజమానులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి పోలీసులు హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిని న్యాయ రిమాండ్ నిమిత్తం కోర్టు ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు పలు ఎలక్ట్రానిక్ ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి గ్రామానికి చెందిన మొహమ్మద్ తురాబుద్దీన్ అలియాస్ బాబన్ (28) బ్లింకిట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కోకాపేట్‌కు చెందిన మొహమ్మద్ అబ్దుల్ సమద్ (28) కూడా అదే సంస్థలో డెలివరీ రైడర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఈ నెల 13న రాత్రి సుమారు 9 గంటల సమయంలో నార్సింగి నుంచి పుప్పాలగూడ వెళ్లే రహదారిలో గీతాంజలి వేదిక స్కూల్ ఎదురుగా ఉన్న బ్లింకిట్ స్టోర్ వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడు సమద్‌పై చేతులతో దాడి చేసి, వెనుకకు బలంగా తోసివేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో సమద్ కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతడిని నార్సింగిలోని జాస్మిన్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి మొహమ్మద్ షకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బీజేపీ మండల అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 14:(క్రైమ్ మిర్రర్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సంస్థాన్ నారాయణ పురం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా చౌరస్తా వరకు జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి మాట్లాడుతూ, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి భాష, సంస్కృతి, సంప్రదాయాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ కోట్లాది భారతీయులను ఒకే భావనతో, ఒకే జాతీయ స్ఫూర్తితో కలిపి ఉంచేది మన త్రివర్ణ పతాకమేనని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా ప్రతి భారతీయుడిని ఏకతాటిపైకి తీసుకువచ్చే శక్తి మన జాతీయ జెండాకు ఉందన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేసే గొప్ప ప్రజా ఉద్యమమని అన్నారు. స్వాతంత్ర్యం ఎంతోమంది మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా లభించిందని, వారి త్యాగాలను ప్రతి తరం గుర్తుచేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశం పట్ల మనకున్న గౌరవాన్ని చాటాలని అన్నారు. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది భారతదేశ గౌరవం, స్వాభిమానం, స్వాతంత్ర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. యువత, మహిళలు, విద్యార్థులు, ప్రతి కుటుంబం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములై దేశ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగరి రఘు, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు వెంకటేష్, నాయకులు కోడూరు బీరయ్య, గొల్లూరు యాదగిరి, సాగర్, జక్కర్తి నరసింహ,వావిళ్ళపల్లి ఉప సర్పంచ్ మెరుగు సైదులు, సంగిశెట్టి లక్ష్మీనారాయణ, బద్దం యాదయ్య గౌడ్, నెల్లికంటి శ్రీశైలం, విద్యార్థులుతో పాటు నాయకులు, కార్యకర్తలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొని హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేశారు.

## భవనంపై నుంచి పడి యువకుడి మృతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. డైమండ్ సిటీ ప్రాంతంలోని పిల్లర్ నంబర్ 244 సమీపంలో ఉన్న జీఎం రెసిడెన్సీ భవనం టెర్రస్‌పై నుంచి 22 ఏళ్ల యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు సమాచారం. మృతుడు కార్మికుడిగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. టెర్రస్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. యువకుడు ప్రమాదవశాత్తు టెర్రస్ నుంచి కిందపడ్డాడా.. లేక ఘటనకు మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.



## ఆలయ పాలకవర్గ సభ్యులు నిజాయితీగా పని చేయాలి

### భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

### మీరు నిజాయితీగా పని చేయండి మీ సమస్యలు నేను పరిష్కరిస్తా

### కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగష్టు 14(క్రైమ్ మిర్రర్):** చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని చైర్మన్, ధర్మ కర్తలను అభినందించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు పూర్ణకుంభం వేదమంత్రాలతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు పాలకమండలి సభ్యులు దేవుడి విషయంలో నిజాయితీగా పని చేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు..

## ఘనంగా కౌన్సిలర్ కటకం రమేష్ జన్మదిన వేడుకలు

### కేక్ కోసి విషెస్ తెలిపిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు పట్టణ 10వ వార్డ్ కౌన్సిలర్ కటకం రమేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం సాయంత్రం చండూరు చౌరస్తాలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా ఆయనే కేక్ కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కౌన్సిలర్ గా బాగా కష్టపడి పని చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ,కోడిగిరి బాబు,కోడి వెంకన్న, కలిమికొండ జనార్ధన్, ఐతరాజు మల్లేష్, స్థానిక పలువురు నాయకులు, 10వ వార్డు ప్రజలు, అభిమానులు వేడుకలో పాల్గొని కౌన్సిలర్ కటకం రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ పవార్ ఐపీఎస్

**మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం**

**బాధితులకు సత్వర న్యాయం, అండగా నిలవాలి**





**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మహిళలు, బాలికలు, చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో, భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ పవార్ నల్గొండలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికలు, చిన్నారులకు అందిస్తున్న పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. భరోసా కేంద్రంలోని కౌన్సెలింగ్ గదులు, బాధితులకు అందిస్తున్న సహాయ సేవలు, కేసుల నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ, భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు, చిన్నారుల పట్ల సానుభూతి, గోప్యత, గౌరవంతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన పోలీస్, వైద్య, న్యాయ, మానసిక సహాయాన్ని సత్వరమే అందించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల కేసుల్లో బాధిత చిన్నారుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని, చైల్డ్ ఫ్రెండ్లీ విధానంలో విచారణ, కౌన్సెలింగ్, ఇతర సహాయ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత పోలీస్ అధికారులు, వైద్య, న్యాయ, ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు, బాధితులకు నిరంతరం సహకారం అందించాలని ఎస్పీ తెలిపారు. కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకు, అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. భరోసా కేంద్రం బాధితులకు "అండగా నిలిచే కేంద్రంగా" పనిచేయాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్ఐ అమీన్, ఎస్ఐ గౌస్, ఏఎస్ఐ అబేదా, శ్రీనివాస్, భరోసా కేంద్రం కోర్డినేటర్ నళిని, సిబ్బంది, సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలను అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోని పరిష్కరించాలి

**బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ఇబ్బందులు లేకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్‌లో గత 3––4 సంవత్సరాలుగా కొనసాగుతున్న పని చేయని, లేని వీధిదీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ వీధిదీపాలు సక్రమంగా లేకపోవడంతో రాత్రివేళల్లో పలు రహదారులు చీకటిగా మారుతున్నాయని, దీంతో ప్రజలు, పాదాచారులు, వాహణాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఇది ప్రజల భద్రతకు కూడా ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. అవసరమైన వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు పని చేయని దీపాలరీను మరమ్మత్తు చేసి పూర్తిస్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దీర్ఘకాలిక సమస్యను అత్యవసర ప్రాధాన్యతతో పరిష్కరించి, కిస్మత్‌పూర్ ప్రజలకు సురక్షితమైన రహదారి సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## కుంట్లూరులో 60 ఏళ్ల మహిళ అదృశ్యం

**హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, ఆగస్టు 14:** కుంట్లూరు లోని వసంత్ నగర్ కాలనీలో 60 ఏళ్ల మహిళ అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు బొయ్యవరపు మైత్రి (60), భర్త పురుషోత్త మసూరి. ఆమె మానసిక వైకల్యంతో బాధపడు తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదుదారుడు బుయ్య వరపు వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 13న ఉదయం సుమారు 11 గంటల సమయంలో తన పనినిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే సమయంలో అతని తండ్రి కూడా విధుల నిమిత్తం బయటకు వెళ్లారు. తల్లి మైత్రి మాత్రం ఇంట్లోనే ఉన్నారు. అనంతరం రాత్రి సుమారు 11 గంటలకు వైష్ణవ్ ఇంటికి తిరిగి వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో వైష్ణవ్ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తన తల్లి ఆచూకీ కనుగొని తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

## ట్యాంక్‌బండ్‌పై ఘనంగా తిరంగా యాత్ర

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పే ఉద్దేశంతో చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన తిరంగా యాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో యాత్ర ఉత్సాహంగా సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ ఐక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయాలని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాండు యాదవ్, మధుసూదన్ రెడ్డి, మహేష్ యాదవ్, అమర్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్‌జీఐటీలో ఘనంగా ఐడియా టు ఇంపాక్ట్

**జీరో వేస్ట్ ట్రైబ్‌కు ప్రథమ బహుమతి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గండిపేట్ పరిధిలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎమ్‌జీఐటీ) ఆడిటోరియంలో శుక్రవారం 'ఐడియా టు ఇంపాక్ట్' పేరిట ఇన్నోవేషన్ పోటీలు ఘనంగా నిర్వహించారు. సరికొత్త ఆలోచనల ద్వారా సుస్థిర మార్పును తీసుకురావడమే లక్ష్యంగా కళాశాల ఐడియా ఇంక్యుబేటర్, ఐఐసీ , ఈ–సెల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. చంద్రమోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఐఐసీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి, ఐఐసీ కన్వీనర్ డా. టి.వి. రజనీ కాంత్, ఐఐసీ కన్వీనర్ డా. కె.సి. సబిత పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. విద్యార్థి సమన్వయకర్తలు తమ్మ అచ్యుత్ బాలాజీ, నివాస్ సల్ల, అఖిలేష్ కంచర్లతో పాటు క్లబ్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పర్యావరణహిత ప్యాకేజింగ్ విధానాల ద్వారా వ్యర్థాలను తగ్గించే వినూత్న పరిష్కారాన్ని ప్రదర్శించిన జీరో వేస్ట్ ట్రైబ్ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. టీమ్ ఏరోట్విన్ ద్వితీయ, టీమ్ జైద్ తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించవచ్చని తెలిపారు. సరికొత్త ఆవిష్కరణలతోనే సమాజంలో సానుకూలమైన, సుస్థిర మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## ప్రమాద బాధితుడు బాలకృష్ణను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ఆగస్టు 14 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మండల కేంద్రంలో. ఎన్ హెచ్ 44 బైపాస్ రోడ్డుపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పరామర్శించారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణకు ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ రెడ్డి.. అధైర్యపడవద్దని, బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం బాలకృష్ణ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## కాంట్రాక్టర్ నిర్వాకం.. పల్లె ప్రకృతి వనం ధ్వంసం

**పల్లె ప్రకృతి వనం ధ్వసం చేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి**

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె.అంజిరెడ్డి**



**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** ప్రతి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి, పచ్చని మొక్కలు, చెట్లతో మినీ పార్కులను తలపించేలా గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిందనీ కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం తో ప్రకృతి వనాలు పడావు పడుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె. అంజిరెడ్డి అన్నారు. కాంట్రాక్టర్ పాలకీడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ప్రకృతి వనం ధ్వంసం చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి పార్క్ ఉండాలనే ఉద్యేశంతో సుమారు నాలుగు లక్షలతో ప్రకృతి వనం నిర్మించడం జరిగిందనీ, కేజీబీవీ ప్రహరీ కోసం చెట్లను ధ్వసం చేయడం దుర్మర్గమైన చర్య అని మండిపడ్డారు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని చెట్లను నాటియాలన్నారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిగూడెం సర్పంచ్ నాగయ్య,బిఆర్ఎస్ నాయకులు సైదులు,హరి నాయక్, గణపతి రెడ్డి, విజయ్, రాజు రాథోడ్, నరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మి నగర్‌లో వీధి నంబర్ల బోర్డుల ఏర్పాటు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్‌లోని భాగ్యలక్ష్మి నగర్ కాలనీలో కాలనీ వాసులు స్వచ్ఛందంగా వీధి నంబర్ల బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కాలనీలోని ప్రతి వీధికి స్పష్టమైన గుర్తింపు ఉండేలా ఈ బోర్డులను ఏర్పాటు చేయడంతో స్థానికులకు, కొత్తగా వచ్చే వారికి వీధులను సులభంగా గుర్తించే అవకాశం కలుగుతోంది. కాలనీలో చిరునామాల గుర్తింపు మరింత స్పష్టంగా ఉండటంతో పాటు పోస్టల్ సేవలు, డెలివరీ సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బందికి కూడా వీధులను గుర్తించడం సులభతరం కానుంది. కాలనీ అభివృద్ధిలో భాగంగా స్థానికులే ముందుకొచ్చి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందిస్తున్నారు. వీధుల పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలతో పాటు కాలనీ అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు....



## గణేష్ నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు శాంతి యుతంగా నిర్వహించుకోవాలి

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

గండిపేట(క్రైమ్ మిర్రర్): పాతనగరంలోని చాంద్రాయణ గుట్ట, బహదూర్ పుర నియోజకవర్గాలలో సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 14 నుంచి 11 రోజుల పాటు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ఉత్సవాల సందర్భంగా కావలసిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం లాంటి పనులు సక్రమంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలకనుమ ఫ్లై ఓవర్ కు ఇరువైపుల ఏర్పాటు చేసిన ఆర్చ్ లను తొలగించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరడం జరిగిందని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు, ప్రతీ వీధిలో వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ లు పాపయ్య, సరిత, సురేందర్ లతో పాటు పాత నగర బీజేపీ నాయకులు కౌడి మహేందర్, జె నవీన్ యాదవ్, నంద కిషోర్, ప్రభాకర్ రావు, ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్, పొన్న శ్రీనివాస్, అడికె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ కాముని చెరువు పరిశుభ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్‌లోని కాముని చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి చెరువును పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి చెరువు పరిశుభ్రత పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటిని పరిశుభ్రంగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడం వల్ల నీటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉన్నందున, దాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ చెరువులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా చెరువులను సంరక్షించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాముని చెరువు పరిశుభ్రత కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

### నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృత తనిఖీలు



రామకృష్ణాపూర్ ఆగస్టు 14 (క్రైమ్ మిర్రర్): గంజాయి సాగు, అక్రమ నిల్వ, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దెరేగడి, తిమ్మాపూర్ ప్రాంతాల్లో శుక్రవారం నార్కోటిక్ డాగ్స్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మందమర్రి సీఐ రమేష్ ఆధ్వర్యంలో, స్థానిక ఎస్ఐ జై శ్రీధర్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు. గంజాయి సాగు చేస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, మామిడి తోటలను నార్కోటిక్ డాగ్స్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. మాదకద్రవ్యాల అక్రమ సాగు, నిల్వ, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ హ్యాండ్లర్ వేణుగోపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.గంజాయి సాగు,అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ జై శ్రీధర్ ప్రజలను కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎంజిఐటిలో ఘనంగా వన మహోత్సవం




ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజిఐటి) ప్రాంగణంలో శుక్రవారం వన మహోత్సవం, కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం ద్వారా జన్మనిచ్చిన తల్లికి గౌరవం ఇవ్వడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించే దిశగా అడుగు వేయవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ హెడ్ డాక్టర్ బార్నబాస్ పాల్గొని శారీరక ఆరోగ్యానికి, పరిశుభ్రమైన పర్యావరణానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి. బాల్ రెడ్డి కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షిస్తూ కళాశాలలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ విభాగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ కళాశాల ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దాలని నిర్వాహకులు సూచించారు.

## వర్షం వస్తే మునిగిపోతున్న కాలనీలు

### నార్సింగిలో రోడ్ల సమస్యలు పరిష్కరించాలి - అశోక్ యాదవ్




గండిపేట, (క్రైమ్ మిర్రర్): నార్సింగి పరిధిలో వర్షాలు కురిసిన ప్రతిసారీ పలు కాలనీలు జలమయ మవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకుడు అశోక్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. నార్సింగిలోని పలు కాలనీల సమస్యలు, నిలిచిపోయిన రహదారుల నిర్మాణాలపై ఆయన శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, సమస్యలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. "వివేకానంద నగర్ కాలనీ, బాలాజీ నగర్ కాలనీల్లో స్వల్ప వర్షానికే నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు వెంటనే స్పందించి ఈ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. బషీర్ కాలనీలోనూ వర్షం పడిన ప్రతిసారీ నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. నార్సింగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మెయిన్ రోడ్డును తక్షణమే నిర్మించి విద్యార్థులు, స్థానికులకు రాకపోకల సౌకర్యం కల్పించాలి. అలాగే నార్సింగి మిలిటరీ హనుమాన్ ఆలయం పక్క నుంచి అల్కాపూర్ టౌన్‌షిప్ వరకు ఉన్న రహదారిని తెరిచి, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. నార్సింగి విజేత సూపర్ మార్కెట్ నుంచి అల్లు స్టూడియో, గోశాల మీదుగా కోకాపేట్ చౌరస్తా వరకు నూతన రహదారి నిర్మించాలి" అని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన మార్గాలను అభివృద్ధి చేస్తే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని అశోక్ యాదవ్ పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తీర్చాలని ఆయన కోరారు.

# 22 నుండి 26 వరకు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

### బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించిన కార్యనిర్వహణ అధికారి, ఆలయ కమిటీ సభ్యులు



క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి : ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతత ను చేకూర్చేవి ఆలయాలేనని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం రోజు ఆనంద్ బాగ్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పత్రిక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ అనంతరంబ్రహ్మోత్సవాల కార్యక్రమ విశేషలను వివరించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శ్రావణ శుద్ధ దశమి శనివారం నుంచి శ్రావణ శుద్ధ చతుర్దశి బుధవారం వరకు 22ఆగస్టు 2026 నుండి 26 వ తేది వరకు ఐదు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయం కార్యనిర్వాహణాధికారి ఎ బి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించెందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. 22వ తేదీ శనివారం కోయిల అల్వార్ తిరుమంజనం అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం పల్లకి సేవ స్వస్తి వాచకం శ్రీ విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచనం రక్షాబంధనం , ఋత్విక్వరణం మృత్సం సంగ్రహం, అంకురార్పణ ధ్వజపటాదివాసం ఆరగింపు మంగళాశాసనం తీర్థప్రసాద గోష్టి నిర్వహించబడును. 23 వ తేదీ ఆదివారం గరుడ హోమం24వ తేదీ సోమవారం 10 గంటలకు ఎదుర్కోళ్ళు అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును సాయంత్రం 6 గంటలకు కు హనుమత్ సేవ రథోత్సవం నిర్వహించబడును 25వ తేదీ మంగళవారం సుదర్శన హోమం మహా పూర్ణాహుతి చక్రస్నానం వసంతోత్సవం మహాకుంభ సంప్రోక్షణ అనంతరం ఆరగింపు, మంగళా శాసనము తీర్థ ప్రసాద గోష్ఠి,సాయంత్రం శ్రీ పుష్పయాగం ద్వాదశారాధన, సప్తావర్ణాలు, ధూపోత్సవం, డాలోత్సవం,దర్బార్ సేవ, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు. 26వ తేదీ బుధవారం ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, ఆరగింపు మంగళా శాసనము,ఆచార్య ఋత్విక్ సన్మానం ,తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించబడును. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, మాట్లాడుతూ ,ఆలయం లో పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి అని అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వేంకట రమణా చార్యులు,అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు, చార్యులు,ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ , ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్ , రాందాస్ సంతోష్ మాజీ సభ్యులు హేమంత్ కుమార్ ,గణేష్ (కన్నా)రవీంద్ర రెడ్డి, భక్తులు జి వి గాంధీ, కృష్ణ రెడ్డి, జీడి సంపత్, ఎస్ రాజు, వెంకటా చారి, సూర్య కుమారి , రమేష్,శారద ,తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ బీసీల సాధికారతకు నిదర్శనం

### బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్



క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్,ఆగస్టు 14:నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే--సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం పట్ల బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది బీసీల సాధికారత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన ల42 శాతం బీసీ వాటాను అన్ని రంగాల్లో సంపూర్ణంగా అమలు చేయాలనిలి ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగాలు, కాంట్రాక్టులు, వ్యాపార అవకాశాలు, పదోన్నతులు, నిర్ణయాధికారంలో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మఖ్దూం మొహియుద్దీన్, ప్రొఫెసర్ జయశంకర్, ఆలే నరేంద్ర, శ్రీకాంతాచారి తదితర మహనీయుల విగ్రహాలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, రాబోయే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేయాలని దాసు సురేశ్ డిమాండ్ చేశారు. పూలే దంపతులకు నిజమైన నివాళి బీసీలకు హక్కులు, అవకాశాలు, వనరులు, అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడమేనని ఆయన అన్నారు. ?

## కుల్కచర్లలో ఘనంగా తిరంగా యాత్ర ర్యాలీ

### తిరంగాతో దేశభక్తిని చాటుకున్న బిజెపి పార్టీ నాయకులు

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు కుల్కచర్ల మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు టెలికం అడ్వైజర్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఘనాపురం వెంకటయ్య గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం పాఠశాల విద్యార్థులచే మువ్వన్నెల జెండాలతో కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో తిరంగా యాత్ర ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని దేశ ఐక్యత సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలని వారు సూచించారు. తిరంగా జెండా ప్రతి ఇంటిపై ఎగురవేయాలని ప్రతి గుండెల్లో దేశభక్తి చాటాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల గ్రామ సర్పంచ్ వారు వాళ్ళ అంజిలయ్య,దిశ అడ్వైజర్ కమిటీ సభ్యులు డాక్టర్ జానకిరామ్ చవాన్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బృంగి హరికృష్ణ, బిజెపి పార్టీ జిల్లా నాయకులు గాదె మైపాల్, పి ఎన్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, కుల్కచర్ల గ్రామ ఉపసర్పంచ్ విజయ్ కుమార్, రాజేందర్, బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షులు కొండా అంజి, బిజెపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రెండు జెండా పండుగల్లో తేడా

పంద్రాగస్టు అని ఉత్సాహంగా ఉత్సవంగా జరుపుకునే స్వాతంత్ర దినోత్సవం వచ్చేసింది కొద్ది సేపట్లో.. త్రి వర్ణం రెప రెపలాడనుంది.జెండా పండుగ ను గర్వంగా ఘనంగా జరుపుకుంటాం.

**జణగణ మన అధినాయక.. జయహే..**

భారత భాగ్య విధాత..

అని గొంతెత్తి,ముక్త కంఠంతో..

జాతీయ భావాన్ని,దేశ భక్తి నీ మన కంఠశోష గా త్రి వర్ణం రెపరెప ల కు సమున్నత గౌరవం తో సెల్యూట్ ..సమర్పిస్తాం వీధి,వీధినా..అధికార..అనధికార పౌరుల సమక్షం లో..గణతంత్ర దినోత్సవం ఘనంగా జరుపుకుంటాం.

**తల ఎత్తి..నుదుట అరచేత్తో సలాం.. చేస్తాశీ.**

మహోన్నత మువ్వన్నెల జెండాకు కు వందనం సగర్వంగా సమర్పిస్తాం.

త్రివర్ణ పతాకం కు ..

జై హింద్

జై హింద్ అంటూ.. సమున్నత గౌరవ భావం తో..

జాతీయ గీతం ఆలకించి, ఆలపించి సెల్యూట్ చేస్తాం.

ఐతే..

స్వతంత్ర దినోత్సవం నాడు జెండా ఎగరవేయడానికి, అలాగే జనవరి 26 నాడు జెండా ఆవిష్కరించడానికి తేడా ఏంటో తెలుసా.. ఆగస్టు 15, 1947న స్వేచ్ఛావాయువులు పీల్చుతూ భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. అందుకే, ప్రతి ఏటా ఈ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ తేదీన దేశవ్యాప్తంగా జెండా ఎగురవేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే 1950 జనవరి 26న దేశంలో రాజ్యాంగం అమలులోకి రాగా.. ప్రతి ఏటా ఈ తేదీని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ రోజున దేశవ్యాప్తంగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం.

ఆగస్టు 15న జెండా ఎగరవేయడానికి.. జనవరి 26న జెండా ఆవిష్కరించడానికి మధ్య చిన్న తేడా ఉంది.



**ఆ తేడా ఏమిటో తెలుసా?!**

ప్రతి సంవత్సరం ఆగస్టు 15న దేశ ప్రధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జాతీయ జెండాను ఎగురవేస్తారు. ఆగస్ట్ 15 రోజున, జాతీయ పతాకాన్ని స్తంభం దిగువన కడతారు బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిందని సూచించడానికి త్రివర్ణ పతాకాన్ని పైకి లాగుతారు.లి మొదటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున బ్రిటిష్ దేశ జెండాను దింపుతూ మన దేశ జెండాను పైకి ఎగురవేశారు. స్వాతంత్ర్యం వచ్చిందని తెలియజేయడానికి ఇలా త్రివర్ణ పతాకాన్ని పైకి లాగి ఎగురవేస్తారు. ఇది కొత్త దేశ ఆవిర్భావానికి ప్రతీకగా నిలుస్తుంది. గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని పైభాగంలో కట్టి, పైకి లాగకుండా విప్పుతారు. ఇలా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా ఇప్పటికే దేశం స్వతంత్రంగా ఉందని తెలియజేస్తారు. ఈ రెండు తేదీలలో జెండాను రెపరెపలాడిస్తారు.

(**గమనిక:** ఇక్కడ జనవరి 26 నాడు జెండాను అప్పటికే కర్ర/పోల్ కి పైన కట్టి ఉంచుతాము కనుక ఆగస్ట్ 15 లాగా జెండాను కింది నుండి పైకి లాగము.)దేశ పౌరుల ప్రతినిధి, భారత పార్లమెంటుకు ప్రజలచే నేరుగా ఎన్నికైన దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవం రోజున జండా ఎగురవేయడానికి.. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి జెండాను ఆవిష్కరించడానికి ఒక కారణం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన సమయం నాటికి భారత రాజ్యాంగం అమలులోకి రాలేదు.అప్పటికి రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి పదవి చేపట్టలేదు. దీంతో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీన రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి రిపబ్లిక్ డే నాడు మహోన్నత జెండాను ఆవిష్కరిస్తారు. అయితే ఇక్కడ గమనించాల్సిన వ్యత్యాసం ఏమిటంటే..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి జెండాను ఎగురవేస్తారు(Flag Hoisting). గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు(Flag Unfurling) .ఇంకొక వ్యత్యాసం ఏమిటంటే .. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వేడుకలు రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరుగుతాయి. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్ట్ 15 నాడు జెండా ఎగురవేసే కార్యక్రమం ఎర్రకోటలో జరుగుతుంది.గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాజ్‌పథ్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.ఈ విషయం ఇప్పటికీ చాలా మంది ఈ దేశ పౌరులకు తెలియదు.(చదువుకున్న వాళ్లకు కూడా చాలా వరకు తెలియదు).జెండా పండుగ పై అవగాహన కల్పించడం మన బాధ్యత. ముఖ్యంగా విద్యార్థులకు తెలియాలి , తెనియజేయాలి

**మాచన రఘునందన్**

**ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్**

**పౌర సరఫరాల శాఖ**

**తెలంగాణ ప్రభుత్వం**



# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

## మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ఆగస్టు 14 క్రైమ్ మిర్రర్:** దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు జాగ్రత్తలతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దోమల నివారణే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ?శుక్రవారం పట్టణంలోని 10వ వార్డులో ప్రత్యేకంగా నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్, వార్డు కౌన్సిలర్ మన్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డు పరిధిలోని డ్రెయిన్లు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ... ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, కూలర్లు, పూల కుండీల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.వారానికి ఒక రోజు శుక్రవారం నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి, శుభ్రంగా తోమి ఆరబెట్టుకోవడం వల్ల దోమల లార్వాను నశింపజేయవచ్చని వివరించారు. మున్సిపల్ సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు కూడా ఈ డ్రై డే కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎం శారద, వార్డ్ ఆఫీసర్ ధర్మ తేజ, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యోగేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానిక వార్డు నాయకులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

**పూలే దంపతుల ఆశయ సాధనలో ప్రజా ప్రభుత్వం**

**దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన**

**రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు**

**ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం**

**విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం**

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్: బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు.

# పార్టీలు వేరైనా మనం ప్రజలకు సేవ చేయాలి : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**గ్రామ పంచాయతీ సెక్రటరీలు సమయపాలన పాటించాలి**

**మునుగోడు అంటే పేరు వుంది కానీ అభివృద్ధి లేదు**

**ప్రతి గ్రామ పంచాయతీలో బెల్టు షాపులపై తీర్మానం చేయాలి**






మునుగోడు క్రైమ్ మిర్రర్: గ్రామాల అభివృద్ధిలో వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరం సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి జరుగుతుందనీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయ అభివృద్ధి సమావేశంలో డిపిఓ తరుణ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసిఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.గ్రామాలు అభివృద్ధి జరగాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అది సాధ్యమవుతుందని, గ్రామంలోని గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవనం, పాఠశాల భవనం, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్ర భవనాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగానే నిర్మాణం చేపట్టాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి రిపోర్టు ను అధికారులు గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన జరగాలంటే ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు..విద్యుత్తు, ఇందిరమ్మ గృహాలు పెన్షన్లు, వ్యవసాయం, రోడ్లు, రెవెన్యూ, తదితరు అంశాలపై చర్చించారు. 90 శాతం అనారోగ్యానికి కారణం మనం త్రాగే నీరని గ్రామాలలో త్రాగునీరు కోసం, బోరు నీరు కోసం విడివిడిగా వాటర్ ట్యాంకులు మైంటైన్ చేస్తున్నారా లేదా అని అధికారులు అడిగి తెలుసుకున్నారు... కచ్చితంగా వేరువేరు ట్యాంకులను మైంటైన్ చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు .మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 400 రోడ్లు వస్తున్నాయని, ఇప్పటికే చాలా రోడ్ల అభివృద్ధి జరుగుతుందని,, అభివృద్ధికి పార్టీలకతీతంగా సర్పంచులు సహకరించాలన్నారు.గ్రామాలు అభివృద్ధి జరగాలంటే ముందుగా గ్రామపంచాయతీ సెక్రటరీలు బాగా పనిచేయాలని, సెక్రటరీలు సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందేనని, సమయపాలన పాటించని వారు ఈ నియోజకవర్గంలో పని చేయాల్సిన అవసరం లేదని హెచ్చరించారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో కరెంట్,మంచినీటి ,సమస్య లేకుండా చూడాలని అన్నారు.మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కృషి చేయడం అభినందనీయం అన్నారు. డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, అందరు మార్కెట్ కమిటీ చైర్మన్ దొటి నారాయణ,మండల ప్రత్యేక అధికారి డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఎమ్మార్వో నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల మండలాధికారులు,అన్ని గ్రామాల సర్పంచులు, మండల ప్రముఖులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

**18 బైకుల చోరీ కేసును ఛేదించిన పెబ్బేరు పోలీసులు**

**జల్సాల కోసం బైక్ చోరీలను వృత్తిగా మార్చుకున్న అన్నదమ్ములు**

**పాత బైకులు, తాళాలు సరిగా లేని వాహనాలే టార్గెట్**

**తెలంగాణలో,8 ఆంధ్రప్రదేశ్‌లో10 వరుస చోరీలు**

**12.50 లక్షల విలువైన 18 బైకుల చోరీ నలుగురిపై కేసు నమోదు**

**వనపర్తి ఆగస్టు 14 క్రైమ్ మిర్రర్:** జల్సాల కోసం బైక్ దొంగతనాలను వృత్తిగా మార్చుకొని, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా బైకులు చోరీ చేస్తూ వాటిని రాష్ట్రం దాటించి విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పెబ్బేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి చోరీకి సంబంధించిన కీలక వివరాలను పోలీసులు తీసుకొచ్చారని. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, అన్నారు. ఎస్పీ సునీత రెడ్డి శుక్రవారం సాయంత్రం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పెబ్బేరు మున్సిపాలిటీ చెలిమిల్ల చెందిన కుర్వ శ్రీరాములు తన బైక్ చోరీకి గురైనట్లు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో రంగాపూర్ గ్రామ శివారులోని గుర్రంగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను గమనించిన నిందితుడు అమీర్ హంజా పఠాన్ బైక్‌ను అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో లోతుగా విచారించారు. దీంతో తన సోదరుడు పఠాన్ నబీఖాన్‌తో కలిసి బైకులు చోరీ చేస్తున్నట్లు నేరాన్ని అంగీకరించాడు. నిందితులు ప్రధానంగా పాత బైకులు, తాళం సెట్‌లు పాడైపోయిన వాహనాలు, సైడ్ లాక్ వేయకుండా పార్కింగ్ చేసిన బైకులు, తాళాలు పెట్టి నిర్లక్ష్యంగా వదిలేసిన వాహనాలను టార్గెట్ చేసేవారు. గత రెండు నెలల్లో తెలంగాణలో 8, ఆంధ్రప్రదేశ్‌లో 10, మొత్తం 18 బైకులను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన బైకులను ఆత్మకూరుకు తరలించి విక్రయించేందుకు లింగాపురం గ్రామానికి చెందిన రమేష్, వెంకటరమణలతో ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బైకులను తాము చోరీ చేసి తీసుకువస్తామని, వాటిని విక్రయిస్తే ఒక్కో బైక్‌కు కమిషన్ ఇస్తామని నిందితులు వారితో డీల్ కుదుర్చుకున్నట్లు తేలింది.

పెబ్బేరు, కొత్తకోట, గద్వాల, మానోపాడు, శాంతినగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, దోర్నాల, పాణ్యం, ఎర్రగొండపాలెం, మార్కాపురం తదితర ప్రాంతాల్లో బైకులను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది.





చోరీ చేసిన 18 బైకుల మొత్తం విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు.

నిందితుల నేర చరిత్రపై ఎస్పీ వెల్లడించింది ప్రధాన నిందితుడు అమీర్ హంజా పఠాన్‌పై గతంలో ఒక కేసు ఉండగా, అతని సోదరుడు పఠాన్ నబీఖాన్‌పై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దొంగతనం, పీడీ యాక్ట్ తదితర తీవ్రమైన కేసులు కలిపి 14 కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. నబీఖాన్ ఇప్పటికే 13 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు.నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

నిందితుల వివరాలు

- అమీర్ అమ్జా పఠాన్ ఏ అమీర్ ఖాన్, ఇందిరానగర్, ఆత్మకూరు పట్టణం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
- పఠాన్ నబీ ఖాన్, గరీబ్‌నగర్, ఆత్మకూరు పట్టణం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
- పాతకోట రమేష్, జి. లింగాపురం గ్రామం, బండి ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
- వల్లేపు వెంకటరమణ, లింగాపురం గ్రామం, బండి ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
- ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు తమ వాహనాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. బైక్‌ను పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్, సైడ్ లాక్ వేసి, సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రదేశంలో పార్కింగ్ చేయాలి. తాళాలు పెట్టి వాహనాలను నిర్లక్ష్యంగా వదిలివేయడం వల్ల దొంగలకు అవకాశం కలుగుతుంది. పాత బైకులు, తాళాలు సరిగా పనిచేయని వాహనాలు కూడా దొంగల టార్గెట్‌గా మారే అవకాశం ఉంది. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల భద్రతకు భంగం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై వనపర్తి జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు. అంతర్ రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్నా నిందితులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అని ఎస్పీ స్పష్టం చేశారు.
- కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్లను ఎస్పీ అభినందించారు.
- అదేవిధంగా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరసింహ, విజయ్, రైటర్ ఆంజనేయులులను నగదు బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# బైక్‌పై ఫాలో అవుతూ.. గోడలపై అలా రాశాడు: నటి

## కాలేజీ డేస్ చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న బుల్లితెర నటి శుభాంగి

కాలేజీ రోజుల్లో తనకు ఎదురైన ఓ భయంకరమైన సంఘటన గురించి బుల్లితెర నటి శుభాంగి ఆత్రే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఆమె ఇంటర్ చదవుతున్న రోజుల్లో ఓ వ్యక్తి రోజు బైక్‌పై ఫాలో అయ్యేవాడని.. అతని చర్యలు చూసి భయపడిపోయానని శుభాంగి చెప్పింది. 'నేను ఇండోర్‌లో 10-11వ తరగతి చదవుతున్నప్పుడు ఓ వ్యక్తి రోజు బైక్‌పై మమ్మల్ని ఫాలో అయ్యేవాడు. కాలేజీ గోడలపై, రోడ్డుపై నా పేరు, తన పేరు కలిపి రాసేశాడు. మా ఇంటికి ఎదురుగా ఉన్న గోడపై కూడా అలానే రాశాడు. నేను అతనితో ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కానీ మా వెనకే తిరిగేవాడు. ఓ సారి మా అక్క అతనితో మాట్లాడింది. 'ఇలా తిరడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని.. ఏదైనా సాధించి రా.. అప్పుడు మనం మాట్లాడుకుందాం'అని చెప్పింది. కొన్నాళ్ల తర్వాత అతను కనిపించకుండా పోయాడు. ఇలాంటి వేధింపులు ఆడపిల్లలను చాలా భయానికి గురి చేస్తాయి. బయటకు కూడా రాలేరు. ఇంట్లో వాళ్లు కూడా భయపడతారు. వేధింపులపై మహిళలు, యువతులు మౌనంగా ఉండకూడదు. ధైర్యంగా ఎదురు తిరగాలి. నేటి తరం అమ్మాయిలు తమ రక్షణ విషయంలో మరింత జాగ్రత్తతో వ్యవహరించడం మంచి పరిణామం' అని శుభాంగి అన్నారు. 'కసౌతీ జిందగీ కే' అనే సిరియల్‌తో సినీ కెరీర్‌ని ప్రారంభించిన శుభాంగి ఆత్రే.. 2007లో వచ్చిన 'కస్తూరి' అనే ధారవాహికతో మంచి గుర్తింపు పొందింది. ఆ తర్వాత 'భాబీజీ ఘర్ పర్ హై!'లో అంగూరి భాభీ పాత్ర పోషించి బాగా పేరు సంపాదించింది. చిడియా ఘర్, అధురి కహానీ హుమారీ, హవన్, దో హాన్సన్ కా జోడా వంటి షోలలో కూడా నటించింది.



# లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది. "గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను" అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది. తమిళ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో ప్రేమాయణం, తదనంతర బ్రేకప్ వార్తలపై మీడియాలో రకరకాల కథనాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, ఆమె పరోక్షంగా ఇచ్చిన ఈ స్పష్టతతో ఆ పుకార్లన్నింటికీ తెరపడినట్లయింది.

# జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!



యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ - మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇటీవల హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది.వైద్యులు ఎన్టీఆర్‌ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, 'డ్రాగన్' చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్‌ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్‌ను తిరిగి పట్టాలెక్కించే అవకాశాలున్నాయి. ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో చ+వ్ఔవశ్రీశ్రీూశీశీఅచీ= హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివంతంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

# వరుస సినిమాలతో దూసుకెళ్తున్న సాయి పల్లవి

సహజత్వానికి మారుపేరు నటి సాయి పల్లవి . డాక్టర్ అయ్యి యాక్టర్ అయిన ఈ తమిళ నటి ఆదిలో నటనపై ఆసక్తితో తమిళంలో చిన్న చిన్న పాత్రలు పోషించినా, మలయాళంలో ప్రేమమ్ చిత్రంతో అనూహ్యంగా దూసుకొచ్చారు. ఆ తరువాత తమిళం, తెలుగు భాషల్లో అవకాశాలు ఈ భామను వెతుక్కుంటూ వచ్చాయి. అలా తెలుగులో నటించిన చిత్రాలు వరుసగా విజయాలను సాధించడంతో అక్కడ స్టార్డమ్ వచ్చింది. ఆ తరువాత కోలీవుడ్‌లో కాస్త ఆలస్యంగా అవకాశాలు వచ్చినా, గార్గి చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత నటించిన కొన్ని చిత్రాలు నిరాశ పరిచినా అమరన్ చిత్రం ఘన విజయాన్ని అందించింది. మళ్లీ తమిళంలో చిన్న బ్రేక్ వచ్చింది. అందుకు కారణం తెలుగులో బిజీగా నటించడం, అదే సమయంలో బాలీవుడ్లో అవకాశాలు రావడం కారణం కావచ్చు. హిందీలో సాయి పల్లవి నటించిన ఏక్ దిన్ చిత్రం పూర్తిగా నిరాశ పరిచింది. అయితే ప్రస్తుతం నటిస్తున్న రామాయణ చిత్రంలో సీతగా ఆమె నటనపై ఆసక్తి నెలకొంది. కారణం ఆ పాత్రలో ఇంతకు ముందు పలువురు ప్రముఖ నటీమణులు నటించడమే. కాగా ఇటీవల విడుదలైన రామాయణ చిత్ర టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఇకపోతే ఇప్పుడు తమిళంలో మరో రెండు క్రేజీ చిత్రాల్లో సాయి పల్లవి కథానాయకిగా నటిస్తున్నారు. అందులో ఒకటి ధనుష్ కు జంటగా నటిస్తున్న ఓం చిత్రం కాగా, రెండోది మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి సరసన నటిస్తున్న రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రం. ఈ రెండు చిత్రాలు సాయి పల్లవి స్థాయిని మరింత పెంచేవిగా ఉంటాయని అంటున్నారు కోలీవుడ్ వర్గాలు.

గ్లామర్‌కు దూరంగా తన సహజమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న సాయి పల్లవి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.





# 'జెన్-జీ భుజంపై తుపాకీ..

## లక్ష్యం భారతదేశం': నటి తనూశ్రీ దత్తా పోస్ట్ వైరల్!

దేశవ్యాప్తంగా యువత (జెన్-జీ) చేపడుతున్న నిరసనలపై బాలీవుడ్ నటి తనూశ్రీ దత్తా సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ఆగ్రహంలో అర్థముందని, అయితే దానిని బాధ్యతాయుతంగా ప్రదర్శించాలని సూచించారు. దేశ భద్రత, సరిహద్దు సమస్యలపై దృష్టి సారించాల్సిన కీలక తరుణమిదని, ప్రస్తుత ప్రభుత్వాన్ని అస్థిరపరచడం దేశానికే ప్రమాదమని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఓ సుదీర్ఘ పోస్ట్‌తో పాటు వీడియోను కూడా పంచుకున్నారు.'జెన్-జీ భుజంపై తుపాకీ ఉంది.. లక్ష్యం భారతదేశం' అంటూ తన పోస్ట్‌ను ప్రారంభించిన తనూశ్రీ.. "విద్యావ్యవస్థలో సంస్కరణలు ఎంతో దూరంలో లేవు. ఇప్పటికే ఆ ప్రక్రియ మొదలైంది. ఈ అంశాన్ని పక్కనపెట్టి, దేశ సరిహద్దులను సురక్షితం చేయడంపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది" అని పేర్కొన్నారు. చక్కగా పనిచేస్తున్న పరిపాలనా వ్యవస్థను భావోద్వేగాలకు లోనై, గుంపు ప్రభావంతో ఇబ్బంది పెట్టవద్దని హితవు పలికారు. ఈ నిరసనల వెనుక మరో కోణం ఉందని తనూశ్రీ అభిప్రాయపడ్డారు. "ప్రస్తుతం దేశంలోని అగ్రశ్రేణి పాలకులలో ఎవరి రాజీనామా అయినా దేశానికి హానికరం. చైనా, బంగ్లాదేశ్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు ఉన్నాయి. మోదీ, అమిత్ షా కలిసి బంగ్లాదేశ్ సరిహద్దును దాదాపు మూసివేశారు. అక్కడ జరుగుతున్న అక్రమ చొరబాట్లు, కార్యకలాపాలు ఆగిపోయాయి. దాని ప్రతిచర్యే ఇప్పుడు కనిపిస్తోంది" అని తనూశ్రీ వివరించారు. సరిహద్దులు మూసివేయడం ఇష్టం లేని శక్తులే ఈ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. యువతను ఉద్దేశించి.. "మీరంటే మాకు ప్రేమ ఉంది. పేపర్ లీక్ కారణంగా మీ ఆగ్రహం సరైనదే. కానీ, ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తున్నప్పుడు విషయాన్ని ఎందుకు పెద్దది చేస్తున్నారు? రాజకీయాలు ఎప్పుడూ నలుపు-తెలుపుల్లో ఉండవు. చాలాసార్లు గ్రే జోన్‌లో ఉంటాయి. ఎవరిని నమ్మాలో జాగ్రత్తగా ఉండండి" అని తనూశ్రీ సూచించారు. "ప్రస్తుతం నాయకత్వాన్ని మార్చడమంటే మన దేశాన్ని సరిహద్దుల వద్ద బలహీనపరచడమే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and
Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No.